సాక్షి
కర్నూలు
శుక్రవారం । 21 । జూలై । 2023



శ్రీమఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు గురువారం భక్తులు పెద్ద సంఖ్యలో మంత్రాలయానికి తరలివచ్చారు. దీంతో దర్శన క్యూలు కిటకిటలాడాయి.



నిలకడగా ఇన్‌ఫ్లో

హొళగుంద: తుంగభద్ర జలాశయానికి 9.536 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. గురువారం సాయంత్రం సమయానికి డ్యాంలో 12.574 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



దొరి'కారు'

వేర్వేరు చోట్ల కార్లు అద్దెకు తీసుకుని వాటిని తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో జల్సాలకు పాల్పడిన ఇద్దరు యువకులను నంద్యాల, నందికొట్కూరు పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

22న 'నవోదయ' పరీక్ష

ఎమ్మిగనూరురూరల్: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 22వ తేదీ శనివారం పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చందిరన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం, ఎమ్మిగనూరు పట్టణంలోని మాచాని సోమప్ప ప్రభుత్వ బాలికల పాఠశాలలో పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు https://navodaya.gov.in,www.nvsadmissionclassnine.in అనే వెబ్‌సైట్ల నుంచి అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

పంచాయతీల్లో పంద్రాగస్టు నుంచి డిజిటల్ చెల్లింపులు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఆగస్టు 15వ తేదీ నుంచి అన్ని రకాల సేవలకు డిజిటల్ చెల్లింపులను మాత్రమే అంగీకరించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనర్ ఆదేశాల మేరకు నగదు రహిత వసూళ్లను మాత్రమే ప్రోత్సాహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ప్రజల్లో అవగాహన పెంచాలని ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. ప్రతి పంచాయతీ అధికారిక బ్యాంకు ఖాతాలకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను అనుసంధానం చేయడంతో పాటు వివిధ రకాల కార్డుల ద్వారా చెల్లింపులు జరిపేలా ప్రత్యేక మిషన్లు కూడా త్వరలో అన్ని గ్రామ పంచాయతీలకు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ ప్రక్రియ ప్రాంభించేందుకు పీఆర్ అండ్ ఆర్‌డీ శాఖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలతో స్టిక్కర్లను కూడా విడుదల చేసిందన్నారు.

తేలికపాటి వర్షాలే!

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో గత మూడు రోజులుగా తేలికపాటి వర్షాలు మాత్రమే కురుస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు 13 మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. ఎమ్మిగనూరులో 6.8 మి.మీ. వర్షం కురిసింది. జిల్లా మొత్తంగా సగటున 1.5 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది.

స్థానిక సంస్థలకు రూ.25.43 కోట్లు విడుదల

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్, మండల పరిషత్‌లకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.25.43 కోట్లు విడుదలయ్యాయి. ఇందులో బేసిక్, టైడ్ గ్రాంట్‌గా జిల్లా పరిషత్‌కు రూ.12,76,02,004, జిల్లాలోని 25 మండల పరిషత్‌లకు రూ.12,67,51,301 విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నేడు జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం ఈ నెల 21న జరుగనుంది. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ నెల రెండవ శుక్రవారం మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాల్లో వచ్చిన వివిధ సమస్యలపై జిల్లా స్థాయి సమావేశంలో చర్చించి పరిష్కారం చూపనున్నారు. డీఏఏబీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని అధికారులు వెల్లడించారు.

నెలాఖరు వరకు అన్ని పంటలకు అనుకూలం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని తేలిక నేలల్లో ఈ నెల చివరి వరకు పత్తి, వేరుశనగ, కంది, సజ్జ, అలసంద వంటి పంటలు వేసుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లరేగడి నేలలు పత్తి, కంది, ఆముదం, కొర్ర, మొక్కజొన్న సాగుకు అనుకూలమని పేర్కొన్నారు. నల్లరేగడి నేలల్లో పత్తి పంటను ఆగస్టు మొదటి వారం వరకు వేసుకోవచ్చని సూచించారు. ఎర్ర నేలల్లో ఆగస్టు నెలలో కంది, సజ్జ, పెసర, అలసంద పంటలు వేసుకోవచ్చన్నారు. అలాగే నల్ల రేగడి నేలల్లో కొర్ర, పొద్దుతిరుగుడు, కంది పంటలు సాగు చేసుకోవచ్చని సూచించారు. రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నేల రకాన్ని, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలను అనుసరించి పంటలు సాగు చేసుకోవాలని తెలిపారు. ఖరీఫ్ సాధారణ వర్షపాతం 401.1 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 88.1 మి.మీ మాత్రమే నమోదైందన్నారు. సాధారణ సాగు 4,21,548 హెక్టార్లు ఉండగా ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నందున పత్తి, వేరుశనగ, కంది, సజ్జ, మొక్కజొన్న, ఆముదం పంటలు ఇప్పటి వరకు 70,019 హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయని పేర్కొన్నారు.

ఆధారమై.. అభ్యున్నతికి తోడై!

- వరుసగా ఐదో ఏడాది వైఎస్సార్ నేతన్న నేస్తం అమలు
- నేడు చేనేత కార్మికుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేయనున్న సీఎం వైఎస్ జగన్
- ఉమ్మడి జిల్లాలో 4,318 చేనేత కుటుంబాలకు ప్రయోజనం
- గత ఏడాదితో పోలిస్తే అదనంగా 400 కుటుంబాలకు లబ్ధి



ఈ చిత్రంలో మగ్గం నేస్తున్న మహిళ పేరు బి. పద్మావతి. ఎమ్మిగనూరు పట్టణం 6వ వార్డులో నివాసం ఉంటున్నారు. పట్టు చీరలు నేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈమెకు 2018 వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం అందలేదు. ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2019 నుంచి నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద పద్మావతికి ఏటా రూ.24వేల ఆర్థిక సాయం అందుతోంది. ఇప్పటి వరకు వరుసగా నాలుగేళ్లు సాయం పొందామని, ఐదో ఏడాదికి కూడా రూ.24వేలు అందుకోనుండటం చాలా ఆనందంగా ఉందని ఈమె తెలిపారు.

ఐదో ఏడాది ఏ జిల్లాలో ఎన్ని కుటుంబాలకు ప్రయోజనం

జిల్లా	కుటుంబాలు	ఆర్థిక ప్రయోజనం
కర్నూలు	3,461	8,30,64,000
నంద్యాల	857	2,05,68,000
మొత్తం	4,318	10,36,32,000

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైఎస్సార్ నేతన్న నేస్తం కింద లబ్ధిపొందిన కుటుంబాల వివరాలు

సంవత్సరం	చేనేత కుటుంబాలు	లబ్ధిపొందిన మొత్తం (రూ.ల్లో)
2019-20	3,998	9,59,52,000
2020-21	3,991	9,57,84,000
2021-22	3,721	8,93,04,000
2022-23	3,918	9,40,32,000
2023-24	4,318	10,36,32,000
మొత్తం	19,946	47,87,04,000

కర్నూలు(అగ్రికల్చర్): మోడుబారిన మగ్గం బతుకులకు రాష్ట్ర ప్రభుత్వం సం'క్షేమ' రంగులు అద్దుతోంది. చేనేత పరిశ్రమ అభివృద్ధికి, చేనేత కార్మికుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తోంది. మరమగ్గాలతో పోటీ పడలేక జిల్లాలో చేనేత పరిశ్రమ చతికిల పడింది. బ్యాంకుల నుంచి సహకారం లోపించింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం చేనేత పరిశ్రమకు ఊపిరి పోసింది. ఆర్థికంగా చితికిపోయిన చేనేత కుటుంబాలకు అండగా నిలిచింది. ఈ పథకం కింద అర్హత కలిగిన చేనేత కుటుంబానికి నెలకు రూ.2,000 ప్రకారం ఏడాది రూ.24వేలు ఒకేసారి నేరుగా వారి బ్యాంకు ఖాతాలకే జమ అవుతోంది. వరుసగా ఐదో ఏడాది నేతన్న నేస్తం ప్రారంభానికి రంగం సిద్ధమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తిరుపతి జిల్లా వెంకటగిరిలో వైఎస్సార్ నేతన్న నేస్తం కింద చేనేతకార్మికుల బ్యాంకు ఖాతాలకు రూ.24వేల ప్రకారం నిధులు బటన్ నొక్కి జమ చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించనున్నారు. ఆయా జిల్లాల్లో జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

ఈ ఏడాది అదనంగా 400 కుటుంబాలకు ప్రయోజనం

వైఎస్సార్ నేతన్న నేస్తం కింద 2022-23లో ఉమ్మడి జిల్లాలో 3,918 కుటుంబాలకు రూ.24వేల ప్రకారం రూ.9,40,32,000 ప్రయోజనం చేకూరింది. ఐదో ఏడాది ఉమ్మడి జిల్లాలో 4,318 చేనేత కుటుంబాలకు ఆర్థిక లబ్ధి కలుగుతోంది. గత ఏడాదితో పోలిస్తే ఐదో ఏడాదిలో అదనంగా 400 కుటుంబాలకు ప్రయోజనం లభిస్తోంది. సొంత మగ్గం కలిగి ఉండి దానిపై పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్న చేనేత కార్మికుల కుటుంబాలన్నిటికీ వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద అర్హత లభిస్తోంది. ఇందులో భాగంగానే ఈ ఏడాది 400 కుటుంబాలకు అదనంగా లబ్ధి కలుగుతోంది. కర్నూలు జిల్లాలో 3,461 కుటుంబాలు, నంద్యాల జిల్లాలో 857 కుటుంబాలకు వైఎస్సార్ నేతన్న నేస్తం కింద ఆర్థిక సహాయం అందుతోంది. ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ. పాటిస్తూ చేనేత కుటుంబాలకు ఎంపిక చేశారు.

చేనేతకు మళ్లీ మంచి రోజులు

ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ చర్యలతో చేనేత రంగానికి మళ్లీ మంచి రోజులు వస్తున్నాయి. ఒకప్పుడు జిల్లాలో 44 చేనేత సహకార సంఘాలు, 25 వేలకు పైగా మగ్గాలు ఉండేవి. దాదాపు 15వేల కుటుంబాలు చేనేతపై ఆధారపడి ఉపాధి పొందేవారు. నేడు ఉమ్మడి జిల్లాలో చురుగ్గా పనిచేస్తున్న సంఘాలు కేవలం 7 మాత్రమే ఉన్నాయి. కర్నూలు జిల్లాలో మూడు, నంద్యాల జిల్లాలో 4 పనిచేస్తున్నాయి. 2018లో ఉమ్మడి జిల్లాలో కేవలం 11 వేల మగ్గాలు మాత్రమే ఉండగా.. నేడు జిల్లాలో 14,650 మగ్గాలు ఉండటం విశేషం.

చేనేత.. ఆధునిక బాట

చేనేత పరిశ్రమ అభివృద్ధికి ఒకవైపు వైఎస్సార్ నేతన్న నేస్తం తోడ్పాటు ఇస్తుండగా... మరోవైపు జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద క్లస్టర్ డెవలప్‌మెంటు కార్యక్రమాన్ని చేపడుతున్నారు. క్లస్టర్ డెవలప్‌మెంట్ కార్యక్రమం కింద ఎమ్మిగనూరు, ఆదోనిలో చేనేత క్లస్టర్లు ఏర్పాటు చేసి చేనేతకార్మికులకు అత్యాధునిక చేనేత పరికరాలు 90 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్నారు. ఇటీవలే ఆదోని చేనేత క్లస్టర్‌లో దాదాపు రూ.45లక్షలు, ఎమ్మిగనూరు క్లస్టరులో దాదాపు రూ.43 లక్షల విలువ కలిగిన జాకార్డ్ 240 హుక్స్, మోటరైజ్డ్ లిఫ్టింగ్ డ్రైవ్స్, ఐరన్ ఫ్రేమ్ లూమ్స్ పంపిణీ చేశారు. ఆధునాతన వస్త్రాలు ఉత్పత్తి చేసేందుకు ఆదోని, ఎమ్మిగనూరు క్లస్టర్లకు ప్రత్యేకంగా డిజైనర్లను కూడా నియమించారు. డిజైనర్లు ఇచ్చిన డిజైన్ ప్రకారం వస్త్రాలు నేసేందుకు చేనేతకార్మికులకు ప్రత్యేకంగా శిక్షణ కూడా ఇస్తున్నారు. బనగానపల్లి మండలం నందివర్గంలో చేనేత క్లస్టరును అభివృద్ధి చేస్తున్నారు. 97 మంది చేనేతకార్మికులకు రూ.44.42 లక్షల విలువ గల పరికరాలు పంపిణీ చేయడానికి రంగం సిద్ధం అయ్యింది.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం చేనేత పరిశ్రమను మరింత అభివృద్ధి చేసుకునేందుకు దోహదపడుతోంది. ఈ పథకం కింద ఇదివరకే నాలుగేళ్లు రూ.24 వేల ప్రకారం ఆర్థిక సహాయం పొందాం. ఐదో ఏడాది కూడా ఆర్థిక సహాయాన్ని విడుదల చేస్తుండటం సంతోషాన్ని ఇస్తోంది. చేనేత పరిశ్రమకు జీవం పోసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– ఎస్.నాగరాజు, నందివర్గం, బనగానపల్లె మండలం

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



వైఎస్సార్ నేతన్న నేస్తం కింద లబ్ధిదారుల ఎంపిక 100 శాతం పారదర్శకంగా జరిగింది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 4,318 కుటుంబాలు అర్హత సాధించాయి. శుక్రవారం ఈ పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించనున్నారు.

– హరికృష్ణ, ఏడీ,చేనేత జౌళి శాఖ

ఆర్టీసీ ఉద్యోగులకు భరోసా ఇచ్చిన సీఎం

- జిల్లా ప్రజా రవాణ శాఖాధికారి వెంకటరామం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): ఆర్టీసీ ఉద్యోగులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారని కర్నూలు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి టి. వెంకటరామం అన్నారు. అధిక పెన్షన్ ఇచ్చేందుకు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కి కృతజ్ఞతగా గురువారం కర్నూలు-1డిపోలో 'థ్యాంక్యూ సీఎం సర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వెంకటరామం మాట్లాడుతూ ఆర్టీసీలో కార్పొరేషన్ నిబంధనలతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు గతంలో భద్రత ఉండేది కాదన్నారు. ఉద్యోగులను ప్రజా రవాణ శాఖ ద్వారా ప్రభుత్వంలో విలీనం చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. దీంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అలవెన్స్‌లు, సౌకర్యాలు, హెల్త్ కార్డులు, 62 ఏళ్లకు పదవీ విరమణ వయస్సు పెంపు వంటివి ఉద్యోగుల్లో ఆనందాలు నింపాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు వెంకటరమణ, కర్నూలు-1, 2 డిపోల మేనేజర్లు సుధారాణి, సర్దార్ హుసేన్ పాల్గొన్నారు.

21 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 21 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎ.ఆనందరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 64 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 4వ సెమిస్టర్ రెగ్యులర్ 12,021 మంది, సప్లిమెంటరీ 9,990 మంది, 5వ సెమిస్టర్ రెగ్యులర్ 6,396 మంది, సప్లిమెంటరీ పరీక్షలకు 4808 మంది హాజరుకానున్నారన్నారు. విద్యార్థులు ఒక గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

నేటి నుంచి ఓటరు జాబితా సవరణ

- ఆగస్టు 21 వరకు కొనసాగనున్న కార్యక్రమం
- ఇంటింటికీ వెళ్లనున్న 2,184 మంది బీఎల్‌ఓలు
- 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కు



డాక్టర్ జి.సృజన, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణ కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఆగస్టు 21వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటా తిరిగి ఓటరు జాబితాపై పూర్తి స్థాయిలో విచారణ చేపడుతారు. 2023 ప్రత్యేక ఓటరు సవరణ జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 19,40,628 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 9,65,685 మంది పురుషులు, 9,74,649 మంది మహిళలు ఉన్నారు. పురుష ఓటర్ల సంఖ్యతో పోల్చితే మహిళల ఓటర్లసంఖ్య 8,964 ఎక్కువగా ఉంది. పాత ఓటర్ల జాబితాపై విచారణతోపాటు కొత్త ఓటర్ల నమోదుకు బీఎల్‌ఓలు దరఖాస్తులను స్వీకరిస్తారు. అంతేగాక బోగస్ ఓట్లను ఏరివేస్తారు. పేర్లు, చిరునామాల్లోని తప్పులను సరిచేస్తారు. నియోజవర్గాలు, ఫొటో మార్పిడి, మరణించిన వారిని జాబితా నుంచి తీసి వేయడం తదితర అంశాలపై ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారు.

బీఎల్‌ఓలకు శిక్షణ

ఓటరు జాబితా సవరణ కోసం ఇంటింటా తిరిగేందుకు 2,184 మంది బీఎల్‌ఓలను నియమించారు. వీరికి ఇప్పటికే శిక్షణ తరగతులను నిర్వహించారు. ప్రత్యేక ఓటరు నమోదు సవరణ 2024లో భాగంగా అక్టోబర్ 17వ తేదీన ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తారు. ఆ జాబితాపై అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. డిసెంబర్ 26వ తేదీనాటికీ అభ్యంతరాల పరిశీలనను పూర్తి చేసి 2024 జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు. కాగా.. అక్టోబర్ 28, 29, నవంబర్ 18,19 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆయా రోజుల్లో జిల్లాలోని 2,184 పోలింగ్ బూతుల్లో అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారు.

6,287 కుటుంబాల్లో పదిమంది కంటే అధికంగా ఓటర్లు

ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో బోగస్ ఓట్ల ఏరివేతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒకే ఇంట్లో పది మంది కంటే ఎక్కువగా ఓటర్లు ఉంటే విచారణ చేపడతారు. కర్నూలు జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో 6,287 కుటుంబాల్లో పదిమంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటికే ఆయా కుటుంబాల్లో ఉన్న ఓటర్లపై అధికారులు విచారణ చేపట్టారు. విచారణ జరిగిన 3,286 కుటుంబాల్లో ఐదు కుటుంబాల్లో బోగస్ ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన కుటుంబాలపై విచారణ కొనసాగుతోంది. అలాగే జిల్లాలో 100 ఏళ్లు దాటిన ఓటర్ల సంఖ్య 684గా ఉంది. వీరిపై కూడా విచారణ చేపడతారు.

ప్రజలు సహకరించాలి

ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి జిల్లా ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలి. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి. జాబితాలో పేర్లు, అడ్రస్, ఫొటో మార్చుకోవచ్చు. మరణించిన వారిని ఓటరు జాబితా నుంచి తీసివేస్తారు. యువతీ, యువకులు భారత రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును పొందాలి.

– డాక్టర్ జి.సృజన, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

దళిత రైతుకు 'ప్రకృతి' ప్రోత్సాహం



దళిత రైతులకు ఇచ్చేందుకు ప్యాకింగ్ చేసిన ప్రకృతి వ్యవసాయ కిట్లు

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 3,460 మంది ఎస్సీ రైతుల గుర్తింపు
- ఒక్కొక్కరికి ఉచితంగా రూ.10 వేలు విలువ చేసే కిట్లు
- ఒక్కో కిట్‌లో మెటీరియల్, 23 రకాల విత్తనాలు

కర్నూలు(అర్బన్): ప్రకృతి వ్యవసాయంలో రాణించేలా దళిత రైతులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఉచితంగా రూ.10 వేల విలువ చేసే మెటీరియల్, 23 రకాల విత్తనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో 1,648, నంద్యాల జిల్లాలో 1,812 మంది.. మొత్తం 3,460 మంది ఎస్సీ రైతులను అధికారులు గుర్తించారు. వీరికి మొత్తం రూ.3.46 కోట్ల విలువ చేసే ప్రకృతి వ్యవసాయ కిట్లను అందజేయనున్నారు.

ఇవీ లాభాలు..

ప్రకృతి వ్యవసాయంతో అనేక లాభాలు ఉన్నాయి. రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులను వాడకుండా, గో ఆధారిత ఎరువులు, వేప సంబంధిత ఉత్పత్తులు, కషాయాలతో నాణ్యమైన పంటలను పండించవచ్చు. పెట్టుబడి ఖర్చు తక్కువగా ఉండటంతో రైతుకు నికరాదాయం లభిస్తుంది. వాతావరణ కాలుష్యం తగ్గడంతోపాటు రసాయన అవశేషాలు లేని ఆహార పంటల ఉత్పత్తి జరుగుతుంది. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటోంది. రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది.


ఉచితంగా ఏమి ఇస్తారంటే..

ప్రకృతి వ్యవసాయం చేసేందుకు వీలుగా ప్రభుత్వం గుర్తించిన దళిత రైతులకు రూ.10 వేల విలువకు సంబంధించి 8 పారముని ట్రోల్స్, స్టిక్కింగ్ ప్లాట్స్ 30, ఒక టార్పాలిన్, ఒక 200 లీటర్ల డ్రమ్ము, 100 లీటర్ల డ్రమ్ములు రెండింటిని అందించనున్నారు. కిచెన్ గార్డెన్, సీడ్ టు సీడ్, ప్రీ మాన్‌సూన్ డ్రై సోయిస్‌కు సంబంధించి 23 రకాల విత్తనాలను అందిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా జొన్న, మొక్కజొన్న, జీలుగ, పిల్లిపెసర, జనుము, కొర్ర, రాగులు, సజ్జలు, వేరుశనగ, నూగులు, మినుములు, పెసలు, కందులు, ఉలవలు తదితర పంటలతో పాటు కిచెన్ గార్డెన్‌లో భాగంగా పలు రకాల ఆకుకూరలు, కూరగాయలకు సంబంధించిన విత్తనాలను అందిస్తున్నారు.

త్వరలో కిట్ల పంపిణీ

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా గుర్తించిన దళిత రైతులకు కిట్లను త్వరలో అందించేందుకు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన వివిధ రకాల విత్తనాలను స్థానిక ఏపీ ఆగ్రోస్ కార్యాలయంలో కిట్లలో ప్యాకింగ్ చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు



ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగా దళిత రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఉచితంగా రూ.10 వేలు విలువ చేసే మెటీరియల్, వివిధ రకాల విత్తనాలను అందిస్తున్నాం. వీటితో పొలంలో ఆరోగ్య కరమైన పంటలను పండించుకునే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మంచి డిమాండ్ ఉంది. గుర్తించిన ఎస్సీ రైతులకు త్వరలోనే ప్రభుత్వం సరఫరా చేసిన కిట్లను అందిస్తాం.

– ఎస్ శ్రీనివాసకుమార్, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

- కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

హొళగుంద: టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో ఇన్ని పథకాలు లేవని, అభివృద్ధి అనేది అసలే లేదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని పేర్కొన్నారు. గురువారం మార్లమడికి గ్రామంలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. నాలుగేళ్లలో మార్లమడికి గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.14,75,11,237 ఖర్చుచేసిందన్నారు. మార్లమడికి రోడ్డు పనులు రెండు నెలలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. హొళగుంద-ఢణాపురం డబుల్ రోడ్డు నిర్మాణం ఈ ఏడాది పూర్తవుతుందన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతిన్నా బీమా కింద పరిహారం అందించి అన్నదాతలను ఆదుకుంటోందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పడటంతో ఎలాంటి సిఫార్సులు లేకుండా ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దనే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. టీడీపీ పాలన ఎలా ఉందో.. వైఎస్సార్‌సీపీ పాలన ఎలా ఉందో ప్రజలే బేరీజు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, పార్టీ నియోజకవర్గ నేత గుమ్మనూరు నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా, ఎంపీపీ తంబాకు నూర్జహన్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ, సర్పంచ్ హరిజన యంకప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరేష్, రమేష్, బీరప్ప, చంద్రశేఖర్, మోహన్‌రాజు, కోగిలతోట శేషప్ప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ స్థాయి స్వయం సహాయ సంఘాల సమాఖ్య(ఎస్‌హెచ్‌జీ పెడరేషన్) అవార్డులు–2023 ప్రదానం కోసం నాబార్డు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ నెల 31లోపు ఆన్‌లైన్‌లో ప్రిలిమినరీ నామినేషన్‌లను అప్‌లోడ్ చేయాలని డీఆర్‌డీఏ–వైకేపీ అధికారులు తెలిపారు. ఒక ఎస్‌హెచ్‌జీ పెడరేషన్‌లో కనీసం 2,000 మంది మహిళలు లేదంటే 200 ఎస్‌హెచ్‌జీలు ఉండాలి. ఐటీడీఏ, ట్రైబల్ ప్రాంతాల్లో కనీసం 700 మంది మహిళలు, 100 ఎస్‌హెచ్‌జీలు ఉండాలి. ఈ ఏడాది మార్చి 31 నాటికి ఫెడరేషన్ మూడేళ్లు పూర్తి చేసుకొని ఉండాలి. మూడేళ్లలో చేపట్టిన కార్యక్రమాలు, వాటి నుంచి వచ్చిన ఆదాయం, నిర్వహణ వ్యయం తదితర వివరాలు స్పష్టంగా చూపాల్సి ఉంది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి వార్షిక వ్యాపార టర్నోవర్ రూ.20 లక్షలు ఉండాలి. కనీసం 300 మంది మహిళలు ఫెడరేషన్ ద్వారా ప్రయోజనం పొంది ఉండాలి. జాతీయ స్థాయిలో మూడు, ప్రాంతీయ స్థాయిలో 10, ప్రత్యేక కేటగిరి కింద ఒకటి ప్రకారం అవార్డులు ఇస్తారు. మరిన్ని వివరాల కోసం shgfed&awards@apmas.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

పోలీసుల అదుపులో అంతర్‌రాష్ట్ర దొంగలు!

కర్నూలు: అంతర్‌రాష్ట్ర దొంగలు ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. కర్నూలు నగరంలో అపార్ట్‌మెంట్లే లక్ష్యంగా ఇటీవల వరుస చోరీలు జరిగాయి. ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్‌లో రెండు అపార్ట్‌మెంట్లు, మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని ప్రసన్న మెస్ వెనుక, మారుతీ మెగా సిటీ వెనుక ఉన్న అపార్ట్‌మెంట్లలో ఇటీవల వరుస దొంగతనాలు జరిగాయి. దీంతో ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కర్నూలు నేర పరిశోధన విభాగం, నాల్గవ పట్టణ పోలీస్ అధికారులు బృందాలుగా ఏర్పడి పక్కా ఆధారాలతో ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను అదుపులోకి తీసుకుని రహస్య ప్రదేశంలో విచారిస్తున్నట్లు సమాచారం. అపార్ట్‌మెంట్లలో జరిగిన నేరాలను ఛేదించాలని బాధ్యతలు అప్పగించడంతో నాల్గవ పట్టణ సీఐ శంకరయ్య, ఎస్‌ఐ మోహన్ కిషోర్‌రెడ్డితో పాటు సీసీఎస్ పోలీసులు ఆధారాలను సేకరించి ఇతర రాష్ట్రంలో ఉన్న నిందితులను పట్టుకొచ్చి విచారిస్తున్నారు. అపార్ట్‌మెంట్లలో నలుగురు వ్యక్తులు చోరీలకు పాల్పడినట్లు గుర్తించినప్పటికీ ఇద్దరు మాత్రమే పోలీసులకు చిక్కారు. మరో ఇద్దరి కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నట్లు సమాచారం. దొంగలు సొంత ప్రాంతానికి కారులో వెళ్లినట్లు గుర్తించి టోల్‌గేట్ ఫీజు ఏ ప్రాంతం బ్యాంకు నుంచి చెల్లించారనే కోణంలో దర్యాప్తు చేపట్టి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ప్రసవ 'వేదన'!

☛ గడివేములకు చెందిన రేణుకకు మొదటి కాన్పులో సాధారణ ప్రసవమైంది. రెండో కాన్పు కోసం ఓ గైనకాలజిస్టు వద్దకు వెళ్లింది. ఆమె సిజేరియన్ చేయాలని చెప్పడంతో ఇష్టం లేక ఇటీవల కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. మూడు రోజుల పాటు ఆసుపత్రిలో ఉంచుకుని ఆమెకున్న అనారోగ్య సమస్యలు నియంత్రణలోకి తీసుకొచ్చి సాధారణ ప్రసవం చేశారు.

☛ గోనెగండ్లకు చెందిన లక్ష్మిదేవి మొదటి కాన్పులో భాగంగా ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగు నెలల పాటు చూపించుకుంది. ఆ తర్వాత పుట్టినిల్లు కర్నూలుకు వచ్చి స్థానిక గైనకాలజిస్టును కలిసింది. ఆమెకు కాస్త బీపీ అధికంగా ఉండటంతో కాన్పు కష్టం అవుతుందని, సిజేరియన్ చేయాలని సిద్ధంగా ఉండాలని చెప్పింది. సిజేరియన్ ఇష్టం లేని లక్ష్మిదేవి ప్రభుత్వాసుపత్రిలో చేరింది. మూడు రోజుల పాటు ఆసుపత్రిలో ఉంచుకుని అనంతరం ఆమెకు సాధారణ ప్రసవం చేశారు.

.. ప్రసవ నొప్పులకు కాస్త ఓపిక పట్టే గుణం ఉండి, ఎలాంటి ఇతర ఆరోగ్య సమస్యలు లేకపోతే ప్రతి మహిళ సాధారణ కాన్పు అవుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసరం అయితే తప్ప సిజేరియన్ల జోలికి వెళ్లనిపరిస్థితి. ఇదే సమయంలో సిజేరియన్ చేస్తే ఆసుపత్రి ఫీజులు అధికంగా వస్తాయని భావించి అధిక శాతం ప్రయివేట్ ఆసుపత్రులు శస్త్రచికిత్సలకే మొగ్గు చూపుతుండటం గమనార్హం.

ప్రయివేట్ ఆసుపత్రుల్లో అధికంగా సిజేరియన్ కాన్పులు

- ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ కాన్పులకే మొగ్గు
- జిల్లాలోని 75 శాతం పీహెచ్‌సీల్లో ప్రసవాలు
- ప్రయివేట్‌లో ధనార్జనే ధ్యేయంగా ఆపరేషన్లు
- అధికంగా బీపీ, షుగర్, ఇతర సమస్యలుంటే సిజేరియన్
- ప్రభుత్వాసుపత్రుల్లో అనారోగ్య సమస్యల ఆధారంగా చికిత్స



కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు ఏరియా ఆసుపత్రులు, 26 అర్బన్ హెల్త్ సెంటర్లు, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, కర్నూలులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఉన్నాయి. ఇందులో అర్బన్ హెల్త్ సెంటర్లు మినహా అన్ని చోట్లా ప్రసవాలు నిర్వహిస్తున్నారు. ఇక 150 పైగా ప్రయివేట్ ఆసుపత్రులు ఉండగా.. 60 వరకు ఆసుపత్రుల్లో ప్రసవాలు చేస్తున్నారు. ఇప్పటికే 75 శాతం పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరుగుతుండగా అన్ని కేంద్రాల్లో కొనసాగించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పీహెచ్‌సీల్లో దాదాపుగా సాధారణ ప్రసవాలే నిర్వహిస్తున్నారు. అక్కడ రిస్క్ అనిపించిన కేసులను మాత్రం సీహెచ్‌సీలకు రెఫర్ చేస్తున్నారు. హైరిస్క్ కేసులను మాత్రం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, ఆదోని మాతాశిశు కేంద్రంకు పంపుతున్నారు. కొందరు వేరుగా ప్రైవేటు ఆసుపత్రుల్లో మొదటి నెల నుంచి చికిత్స చేయించుకుని అక్కడే ప్రసవాలు జరిగేలా ఏర్పాటు చేసుకుంటున్నారు. కాగా జిల్లాలో గత సంవత్సరం 61,450 ప్రసవాలు జరగ్గా అందులో 35,018 ప్రసవాలు ప్రైవేటు ఆసుపత్రుల్లో జరగడం గమనార్హం. ఆ తర్వాత కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనే 9,455 ప్రసవాలు జరిగాయి. ఇక్కడ ప్రతిరోజూ 30 నుంచి 35 ప్రసవాలు జరుగుతున్నాయి.

2022–23లో జరిగిన ప్రసవాలు

ఆసుపత్రి	జరిగిన ప్రసవాలు
పీహెచ్‌సీలు	7,094
సీహెచ్‌సీలు	6,588
ఎస్‌డీహెచ్‌ఎస్	3,295
జీజీహెచ్, కర్నూలు	9,455
ప్రైవేటు	35,018
మొత్తం	61,450

సిజేరియన్ కాన్పులే అధికం

గత ఆర్థిక సంవత్సరం జిల్లాలో 61,450 ప్రసవాలు జరగగా అందులో 25,106 సిజేరియన్ ప్రసవాలే. మొత్తంగా ఎస్‌డీహెచ్‌లో 513, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 4,678 కాగా.. ప్రైవేటు ఆసుపత్రుల్లో 19,915 సిజేరియన్ ప్రసవాలు జరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరుతున్న వారిలో 80 శాతం జరుగుతుండగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 30–40 శాతం మాత్రమే సిజేరియన్ కాన్పులు ఉంటున్నాయి. కాగా బిడ్డ అడ్డం తిరిగినప్పుడు, ఎదురుకాళ్లతో జన్మిస్తున్నప్పుడు, గర్భిణికి బీపీ, షుగర్ నియంత్రణలో లేనప్పుడు, గుండె జబ్బులున్నప్పుడు, గర్భంలో బిడ్డ పెద్దగా ఉన్నా, ప్రసవ ద్వారం చిన్నగా ఉన్నా, మాయ నుంచి రక్తం కారుతున్నా, గర్భిణికి ఫిట్స్ వస్తున్నా సిజేరియన్ అవసరం. ఇతర సమయాల్లో సాధారణ ప్రసవాలే ఉత్తమమని వైద్యులు చెబుతున్నారు. కాగా కొందరు గర్భిణీల కుటుంబీకులు ముహూర్తం కోసమని వైద్యులతో మాట్లాడుకుని సిజేరియన్ చేయాలని కోరుతున్నారు.

హైరిస్క్ వారికి మాత్రమే సిజేరియన్



ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణీల్లో దాదాపుగా 30 నుంచి 42 శాతం మందికి మాత్రమే అప్పటి అవసరం మేరకు సిజేరియన్ ఆపరేషన్ ద్వారా బిడ్డను బయటకు తీస్తున్నాం. ఇతర సమయాల్లో సాధారణ ప్రసవాలకే మొదటి ప్రాధాన్యం ఇస్తున్నాం. మొదటి కాన్పులో సిజేరియన్ అయినా రెండో కాన్పులో సాధారణ కాన్పులు చాలా చేశాం. గైనకాలజీ విభాగంలో ప్రతిరోజూ 30 నుంచి 35 దాకా ప్రసవాలు జరుగుతున్నాయి. జిల్లాలో ఇక్కడే అత్యధిక ప్రసవాలు చేస్తున్నాం. ఎక్కువగా సాధారణ ప్రసవాలే చేస్తున్నాం.

– డాక్టర్ ఎస్.మాణిక్యరావు, ప్రొఫెసర్, గైనకాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నాం



ఇటీవల పలు ప్రైవేటు ఆసుపత్రులపై దాడులు నిర్వహించాం. అక్కడి ప్రసవాల రికార్డులు పరిశీలించి మొత్తం ప్రసవాల్లో 90 శాతం దాకా సిజేరియన్‌లు ఉన్న ప్రైవేటు ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. ఇకపై తరచూ ప్రైవేటు ఆసుపత్రులపై మా ప్రోగ్రామ్ అధికారులు దాడులు నిర్వహిస్తూనే ఉంటారు. గర్భిణి కేస్ షీట్‌ను పరిశీలించి హైరిస్క్ ఉన్న వారికే సిజేరియన్ చేయాలని సూచిస్తున్నాం. అవసరం లేకుండా సిజేరియన్లు నిర్వహిస్తే చర్యలు తప్పవు.

– డాక్టర్ బి.రామగిడ్డయ్య, డీఎంహెచ్‌ఓ, కర్నూలు

కొలువుదీరిన లాల్‌స్వామి



చిన్న మకానంలో పూజలందుకుంటున్న లాల్‌స్వామి పీర్లు

చాగలమర్రి: మొహర్రం సందర్భంగా చాగలమర్రిలోని చిన్నమకానం వీధిలో గురువారం లాల్‌స్వామి పీరును కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. చాగలమర్రిలో ఈ పండుగను కులమతాలకు అతీతంగా నిర్వహిస్తారు. గ్రామానికి చెందిన వారు వ్యాపార రీత్యా, ఉద్యోగ రీత్యా ఎక్కడ ఉన్నా ఈ పండుగకు కచ్చితంగా హాజరవుతారు. వేల సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తారు. మొహర్రం వేడుకల్లో భాగంగా ఈనెల 28 అర్ధరాత్రి లాల్‌స్వామి పీరును దీవిటిల వెలుగులో గ్రామం ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. 29వ తేదీ సాయంత్రం వరకు ఊరేగింపు కొనసాగుతోంది. 31న జియారత్ కార్యక్రమంతో మొహర్రం వేడుకలు ముగుస్తాయని లాల్‌స్వామి కమిటీ అధ్యక్షులు ముల్లా జిలానీ, ఉపాధ్యక్షులు చక్రం షబ్బీర్, ప్రధానకార్యదర్శి ముల్లా ఖాదర్‌బాషా తెలిపారు. ఈ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చాగలమర్రి ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.

తొమ్మిదేళ్ల బాలికకు అరుదైన శస్త్రచికిత్స

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా అందరికీ మూత్రాశయం నుంచి మూత్రం బయటకు వెళ్తుంది. కానీ ఈ బాలికకు మూత్రాశయం నుంచి మూత్రం బయటకు రాకుండా కిడ్నీలోకి వెనక్కి వెళ్తోంది. అరుదైన ఈ సమస్యకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల చిన్నపిల్లల శస్త్రచికిత్స నిపుణులు ఆపరేషన్ చేసి సరిచేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మొదటిదైన ఈ ఆపరేషన్‌ను డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా నిర్వహించారు. వివరాలను ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెచ్‌ఓడీ డాక్టర్ శివకుమార్‌తో కలిసి ప్రొఫెసర్ డాక్టర్ పి.సునీల్‌కుమార్‌రెడ్డి వివరించారు. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రానికి చెందిన నూర్ మహమ్మద్ కుమార్తె సాధికా మెహర్(9)కు నాలుగేళ్లుగా జ్వరం, మూత్రంలో మంట, కడుపునొప్పి వంటి సమస్యలు వేధిస్తున్నాయి. ఈ సమస్యకు బాలికకు తల్లిదండ్రులు అనంతపురంలోనే చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో వారు ఈ నెల 5న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల శస్త్రచికిత్స విభాగానికి వచ్చారు. బాలికను పరీక్షించిన వైద్యులు ఆమెకు మూత్రాశయం నుంచి మూత్రం రివర్స్‌లో కిడ్నీలోకి వెళ్తోందని గుర్తించారు. దీనివల్ల కిడ్నీ దెబ్బతిన్నట్లు నిర్ధారించుకున్నారు. వైద్యపరిభాషలో ఈ సమస్యను వేసికో ఇరిట్రిన్ సిఫ్లెక్స్ అంటారని పేర్కొన్నారు. ఈ సమస్యను చికిత్స చేయకుండా అలాగే వదిలేస్తే భవిష్యత్‌లో కిడ్నీ పూర్తిగా దెబ్బతిని డయాలసిస్‌కు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. సాధారణంగా ఇలాంటి కేసుల్లో ఓపెన్ పద్ధతిలో బైలేట్రల్ యురెట్రస్ రీప్లాంటేషన్ చేస్తారు. దీనివల్ల అనేక సమస్యలున్నాయని గుర్తించి, తక్కువ కోతతో మినిమల్ వేసికో స్కోపిక్ రీ ఇన్‌ప్లాంటేషన్ ద్వారా సమస్యను పరిష్కరించారు. ఇలాంటి ఆపరేషన్ వల్ల తక్కువ కోత, నొప్పి తక్కువగా ఉండటం, త్వరగా కోలుకోవడం, త్వరగా పనులు చేసుకోగలగడం జరుగుతుందని వైద్యులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇలాంటి అత్యాధునిక పద్ధతిలో ఆపరేషన్ చేయడం ఇదే మొదటిసారని, అది కూడా ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. బాలిక పూర్తిగా కోలుకోవడంతో గురువారం డిశ్చార్జ్ చేశామన్నారు. సమావేశంలో చిన్నపిల్లల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ గ్రేస్, డాక్టర్ నరేష్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పౌష్టికాహారం

కర్నూలు(సెంట్రల్): టేక్ హోమ్ రేషన్ విధానం ద్వారా ఆగస్టు 1 నుంచి గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దనే పౌష్టికాహారం అందజేయాలని అధికారులను రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. టేక్ హోమ్ రేషన్ కిట్లను నాణ్యతా ప్రమాణాలతో తయారు చేయాలన్నారు. గురువారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, జేసీలు, జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

డెబిట్‌కార్డు వినియోగంతో బీమా సదుపాయం

కర్నూలు(అగ్రికల్చర్): డెబిట్‌కార్డు వినియోగంతో బీమా సదుపాయాన్ని పొందవచ్చని కర్నూలు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ సుమన్ తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారుడైన పసెద్దుల పవన్‌కుమార్(24) కజికిస్తాన్ దేశంలో ఉంటూ ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయాన్ని ఖాతాదారుని తండ్రి యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచి సహాయ మేనేజర్ ఎస్.సంజీవకుమార్ దృష్టికి తెచ్చారు. దీంతో వెంటనే డెబిట్ కార్డు వినియోగాన్ని పరిశీలించి, బీమా సదుపాయం వర్తిసుందని నిర్ధారించారు. మృతి చెందిన పవన్‌కుమార్ కుటుంబసభ్యులకు గురువారం బీమా మొత్తం రూ.2లక్షలు అందచేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ సుమన్ మాట్లాడుతూ పూర్తి అవగాహనతో డెబిట్ కార్డు వినియోగించాలన్నారు.

పంట కాలువలో పడి యువకుడి మృతి



మృతి చెందిన శ్రీనివాసులు (ఫైల్)

పెద్దకడబూరు: ప్రమాదవశాత్తూ పంట కాలువలో పడి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన కంబదహాల్ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దస్తగిరమ్మ, నల్లన్న దంపతుల కుమారుడు శ్రీనివాసులు (24) బుధవారం దొడ్డిమేకల గ్రామంలో తమ బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లాడు. కార్యక్రమం పూర్తయిన తర్వాత కంబదహాల్ గ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. హెచ్.మురవణి గ్రామం దాటిన తరువాత పంట పొలాల మధ్యలో ఉన్న కాలువలోకి పడిపోయి మృతి చెందాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం కాలువలో ద్విచక్ర వాహనం కనిపించంగా, దానిని పైకి లేపగా శ్రీనివాసులు మృతదేహం కనిపించింది. శ్రీనివాసులకు భార్య రాజేశ్వరి, ఒక కుమార్తె ఉన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన నిందితులు, కర్ణాటక మద్యంతో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ, పోలీసులు

హాలహర్వి: హాలహర్వి గ్రామశివారులోని ఇండియన్ బ్యాంకు వద్ద గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న బొలెరో మాక్సి టక్‌ను, ఇద్దరు ముద్దాయిలను అదుపులోకి తీసుకున్నట్లు ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు విలేకరులకు తెలిపారు. గోనెగండ్ల మండలం బి.అగ్రహారం గ్రామానికి చెందిన బి.సురేంద్ర, ఎమ్మిగనూరు మండలం సిరాలదొడ్డి గ్రామానికి చెందిన డి.దర్గయ్యలు కలిసి వారి బొలెరో మాక్సి టక్ ప్లస్ అనే వాహనంలో 90ఎంఎల్ పరిమాణం గల 81 బాక్సుల ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు, 180 ఎంఎల్ పరిమాణం గల 10 బాక్సులు టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు పట్టుకోవడం జరిగిందన్నారు. వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ నాగేంద్ర, ఏఎస్‌ఐ ఇంద్రుడు, కానిస్టేబుళ్లు గోవర్ధన్, అయ్యస్వామి పాల్గొన్నారు.

ప్రాచీన కట్టడాల పరిశీలన



ప్రాచీన కట్టడాలను పరిశీలిస్తున్న దేవదాయశాఖ, ఇంజినీరింగ్ అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆలయ ప్రాంగణంలోని ప్రాచీన కట్టడాలను దేవదాయశాఖ శిల్పి విభాగం, ఇంజినీరింగ్ విభాగం అధికారులు గురువారం పరిశీలించారు. ఈఓ లవన్న, దేవదాయశాఖ స్థపతి పి.పరమేశ్వరప్ప, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వి.రామకృష్ణ, మురళీధర్, కర్నూలు డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసప్రసాద్ తదితరులు ఆలయ పశ్చిమ ప్రాకార కుడ్యం, ఆలయ ప్రాంగణంలోని బండపరుపు, వీరశిరోమండపం, నందిమండపం, అమ్మవారి ఆలయ ద్వార గోపురం మొదలైన వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థపతి పి.పరమేశ్వరప్ప మాట్లాడుతూ క్షేత్ర పరిధిలోని ప్రాచీన కట్టడాలను పరిక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని దేవస్థానానికి సూచించారు. ప్రధానాలయ ప్రాంగణంలోని బండపరుపు హెచ్చు తగ్గులు లేకుండా సమతలంగా ఉండే విధంగా మరమ్మతులు చేయాలన్నారు. అమ్మవారి ఆలయంలో ఉత్తర భాగంలో నిర్మాణంలో ఉన్న సాలు మండప నిర్మాణాన్ని వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. వారి వెంట దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.చంద్రశేఖరశాస్త్రి, , సహాయ స్థపతి ఉమా వెంకట జవహర్‌లాల్, ఏఈలు భవన్‌కుమార్, రాజారావు, స్ట్రక్చరర్ ఇంజినీర్లు వేణుగోపాలరెడ్డి, రమేష్, నగేష్ తదితరులు ఉన్నారు.

రూ.13 లక్షల విత్తన విక్రయాల నిలిపివేత



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని 12 విత్తన దుకాణాల్లో రూ.13.43 లక్షల విలువచేసే విత్తన విక్రయాలు నిలుపుదల చేసినట్లు స్పెషల్ స్క్వాడ్ ఏడీఏ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్పెషల్ స్క్వాడ్ కర్నూల్ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓలు మహేశ్వరరెడ్డి, శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మొత్తం 12 దుకాణాల్లో తనిఖీలు చేసినట్లు చెప్పారు. ధనుంజయ ట్రేడర్స్‌లో రూ.5,19,220, చార్వి ఆగ్రో ఏజెన్సీ రూ.4,49,266, శ్రీ లక్ష్మీ ఎంటర్ ప్రైజెస్‌లో రూ.3,19,800, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఎంటర్ ప్రైజెస్‌లో రూ.54,847 విలువ చేసే విత్తన విక్రయాలను తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు చెప్పారు. విత్తనాలకు సంబంధించి సోర్స్ సర్టిఫికెట్స్ చూయించే వరకు విక్రయాలు జరపరాదని దుకాణదారులకు సూచించారు.

దొ'రి' 'కారు'

- అద్దె కార్లు తాకట్టు పెట్టి జల్సాలు
- నంద్యాలలో ఒకరు.. నందికొట్కూరులో మరొకరు
- రూ. లక్షలు టోకరా పెట్టిన ఘనులు
- యజమానుల ఫిర్యాదుతో ఇద్దరూ అరెస్ట్
- రెండు చోట్ల 21 కార్లు రికవరీ



నందికొట్కూరులో రికవరీ చేసిన కార్లను చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసులు, టౌన్ సీఐ, ఎస్‌ఐ

నందికొట్కూరు/బొమ్మలసత్రం: కార్లు అద్దెకు తీసుకుని వాటిని తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో జల్సాలకు పాల్పడిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. నందికొట్కూరులో ఓ యువకుడు, నంద్యాలలో మరో యువకుడు ఇదే తరహాలో మోసానికి పాల్పడ్డారు. కారు యజమానులకు రూ. లక్షల్లో టోకరా పెట్టి చివరకు పోలీసులకు చిక్కారు. నందికొట్కూరులో సయ్యత్ జావీద్ బాషా నుంచి 8 కార్లను, నంద్యాలలో షేక్ అన్సార్ నుంచి 13 కార్లను పోలీసులు రికవరీ చేశారు. గురువారం నందికొట్కూరు పోలీస్ స్టేషన్‌లో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు మీడియాకు వివరించారు. ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన సయ్యత్ జావీద్‌బాషా ప్రస్తుతం నందికొట్కూరు పట్టణంలోని తాలూకా ఆఫీస్ రోడ్డులో నివాసముంటున్నాడు. కొన్నాళ్లు క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడి అప్పులపాలయ్యాడు. ఈ క్రమంలో పట్టణంలో కార్లు అద్దెకిచ్చే వారిని పరిచయం చేసుకుని వారిని బురిడీ కొట్టించాడు. వచ్చిన డబ్బుతో జల్సాలు చేసినట్లు తెలుస్తోంది. 2022 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు ఎనిమిది కార్లను నెల బాడుగ ఇచ్చేలా తీసుకుని వాటిని పట్టణంలో కొందరి వద్ద తాకట్టు పెట్టాడు. యజమానులకు అద్దె ఇవ్వకుండా మొహం చాటేయడంతో సయ్యత్ జావీద్‌బాషాపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టడంతో కార్లు తాకట్టు పెట్టిన విషయం వెలుగులోకి వచ్చింది. యువకుడిని అరెస్ట్ చేసి రూ.60 లక్షలు విలువ చేసే ఎనిమిది కార్లను రికవరీ చేశారు. కార్లు రికవరీ చేసిన టౌన్ సీఐ విజయభాస్కర్, ఎస్‌ఐ ఎన్వీ రమణ హెడ్‌కానిస్టేబుల్ టీవీ రమణ, పీసీఎస్ చెన్నయ్య, నాగార్జున పురుషోత్తం రెడ్డి, శివ, హోంగార్డులను డీఎస్పీ అభినందించారు.

నంద్యాలలో 13 కార్లు రికవరీ..

కార్ల యజమానులకు టోకరా పెట్టిన సాయిబాబానగర్‌కు చెందిన షేక్ అన్సార్ హుసేన్‌ను అరెస్ట్ చేసి, 13 కార్లను రికవరీ చేశారు. కేసు వివరాలను నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి మీడియాకు వివరించారు. షేక్ అన్సార్ బీసీఏ వరకు చదువుకున్నాడు. ఈ క్రమంలో జల్సాలకు అలవాటు పడి కారు డ్రైవర్‌గా ఒక ట్రావెల్ యజమాని వద్ద చేరాడు. ట్రావెల్‌లో ఉన్న కారుకు డ్రైవర్‌గా వెళుతూ యజమానుల మచ్చిక చేసుకున్నాడు. నెల బాడుగ ఉండంటూ వారి వద్ద వాహనం తీసుకొని వెళ్లి శిరివెళ్ల మండలం బోయిలకుంట్లకు చెందిన వడ్డీ వ్యాపారుల వద్ద తనఖా పెట్టాడు. కారు యజమాని చంద్రభూపాల్ ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు అన్సర్ హుసేన్ అదుపులోకి తీసుకొని విచారించగా ఏడాదిగా దాదాపు 13 కార్లు కుదవపెట్టి రూ.23 లక్షలు తీసుకొని జల్సాలకు ఖర్చు చేసినట్లు గుర్తించారు. ఈ క్రమంలో నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.